హరీశ్‌రావును కలిసిన ఐలాపూర్ వాసులు

మాజీ మంత్రి హరీశ్ రావును కలిసిన ఐలాపూర్ వాసులు

అమీన్‌పూర్ డిసెంబర్ 27 : బీఆర్ఎస్ యువ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ శుక్రవారం మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును మర్యాద పూర్వకంగా వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఉన్న పలు అంశాల మీద చర్చించారు. ఆయన వెంట ఐలాపూర్ నాయకులు ఉన్నారు.

పేదలకు భూములు పంచాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఖాలేక్

లక్ష్మాపూర్ ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

గుమ్మడిదల, డిసెంబర్ 27: కస్టోడియన్ భూములు పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీఎం ఖాలేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మిడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మాపూర్‌లో 1 నుంచి 59 సర్వే నంబర్‌లో 1047 ఎకరాల మిగులు భూములు ఉన్నాయని, వాటిల్లో 400 ఎకరాలను ఓ భూస్వామి సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూములను పేదలకు పంచాలని శుక్రవారం సీపీఐ నాయకులు వందల మంది పేద రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఖాలేక్ మాట్లాడుతూ.. ఇలాంటి భూములను వెంటనే రాష్ట్ర సర్కారు స్పందించి నిరుపేద రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి ఆందోళన విరమింప చేశారు. రమేశ్‌గౌడ్, కిషన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

విద్యార్థిని చిద్రి లిఖితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 27 : ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ అఫ్ ఇండియా సంస్థ విడుదల చేసిన సీఎ పరీక్ష ఫలితాల్లో దేశస్థాయిలో 37వ ర్యాంకు సాధించిన జహీరాబాద్ విద్యార్థిని చిద్రి లిఖితను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జహీరాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారస్తుడు చిద్రి ఉమా హనుమాన్ గుప్తా దంపతుల కుమార్తె చిద్రి లిఖితను శాలువతో సత్కారించారు. మాజీ మున్సిపల్ కౌన్సలర్, బీఆర్ఎస్ నేత నామరవికిరణ్, తులసీదాస్, నీలరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, డిసెంబర్ 27 : కర్ణాటకలోని గుల్బర్గా పట్టణంలోని ఖాజా బందేనవాజ్ దర్గాను జహీరాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు దర్శించుకున్నారు. శుక్రవారం స్థానిక దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుట్టు నారాయణ, డీలర్స్ సంఘం అసోసియన్ డివిజన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాధవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుల్బార్గాలోని బందేనవాజ్ దర్గాను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

నష్టపరిహారం అందజేస్తాం..

పరిశ్రమ యజమాన్యంతో చర్చలు జరుపుతున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

బొల్లారం, డిసెంబర్ 27 : పరిశ్రమ విధుల నిమిత్తం వేరే రాష్ట్రానికి వెళ్లిన ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బొల్లారం పారిశ్రామిక వాడలోని ఎక్సెల్ రబ్బర్ లిమిటెడ్ పరిశ్రమలో కడారు కిషన్ (38) కార్మికుడు. పరిశ్రమ పనుల నిమిత్తం మరో రాష్ట్రానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. శుక్రవారం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, స్థానిక నాయకులు జైపాల్ రెడ్డిలు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు న్యాయం చేయాలని పరిశ్రమ యజమాన్యంతో వారు చర్చలు జరిపారు. ఈ మేరకు పరిశ్రమ యజమాని రఘునాథరెడ్డి మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చి నాయకుల సమక్షంలో హామీ ఇచ్చారు. వెంటనే అంత్యక్రియల నిమిత్తం తక్షణసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కో-ఆప్షన్ సభ్యులు మునీర్, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్, యువజన నాయకులు అబ్దుల్ బషీర్, పరిశ్రమ ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

గజ్వేల్, డిసెంబర్ 27 : గ్రామ పంచాయతీ కార్మకులకు బకాయి పడిన నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరాస్తాలో రాస్తారోకో చేశారు. ఎన్నికలకు ముందు జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తమని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. నేతలు వెంకటాచారి, యాదగిరి, నర్సింహులు, కనకయ్య, ఎల్లం, నాగరాజు, యాదమ్మ, ప్రవీణ్ ఉన్నారు.

గజ్వేల్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

జహీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ శ్రేణులు

గుమ్మడిదలలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో శుక్రవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, నేతలు నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 27

ఆర్సీపురంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షేక్‌అబ్దుల్ ఘనీ, ఖధీర్, నాయకులు

బొల్లారం: కొడకంచిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తున్న వివిధపార్టీల నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్ : మున్సిపల్ పరిధిలోని జీరంగూడ శివాలయం చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

పరామర్శ

కల్హేర్, డిసెంబర్ 27 : మండల కేంద్రమైన కల్హేర్ గ్రామ ఉపాధ్యక్షుడు మాణిక్ ప్రభుగౌడ్ మాతృమూర్తి మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతి కి గల వివరాలను అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ నర్సింహరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాంసింగ్, మాజీ ఎంపీటీసీ సంగప్ప, గ్రామ అధ్యక్షుడు పండరి, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, ఉన్నత పాఠశాల చైర్మన్ బాలయ్య, నాయకులు బాలయ్య, కుమ్మరి సాయిలు, హన్మంత్ రావ్, నర్సింహా గౌడ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, డిసెంబర్ 27: నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భూపాల్ కుమారుడికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా శ్రేయస్సు కోసం నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు.

పలు దుకాణాలకు జరిమానా

నారాయణఖేడ్, డిసెంబర్ 27: నారాయణఖేడ్ పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలు దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మెన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించే చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విద్యార్థుల ఆందోళనతో సిబ్బందిపై చర్యలు

అందోల్, డిసెంబర్ 27 : ప్రిన్సిపాల్‌ను మార్చాలంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనతో రెగ్యులర్ సిబ్బందితో పాటు కాంట్రాక్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు సంబంధిత అధికారులు. ఈ నెల 22, 23 తేదీల్లో విద్యార్థులు ప్రిన్సిపాల్ మాకొద్దు..అంటూ ధర్నాకు దిగడం.. ఆ తర్వాత అందుకు కారణం ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడేనని ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదుచేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రిన్సిపాల్ సెలవుపై వెళ్లడం ఆమె స్థానంలో నారాయణఖేడ్ ప్రిన్సిపాల్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా ఇక్కడి 31 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను హైదరాబాద్‌లోని సంబంధిత శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సిబ్బంది లేకపోవడంతో తాత్కాలికంగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయుల నియామకం చేపడుతున్నారు. ఈ మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించగా 41 దరఖాస్తులు వచ్చాయి. వీరికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం డెమో క్లాసులను నిర్వహించారు. విద్యార్థులు ధర్నా చేయడం.. ఆపై కేసులు, ప్రిన్సిపాల్ సెలవుపై వెళ్లడం.. రెగ్యులర్‌తో పాటు, కాంట్రాక్ట్ సిబ్బందిని మార్చి వారి స్థానంలో మొత్తం కొత్త వారిని నియమించడం చర్చనీయంశంగా మారింది.

అందోల్‌లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహిస్తున్న డెమో క్లాస్‌లు

కేంద్రమంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కేంద్ర మంత్రి తీరుకు నిరసనగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 27: రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం బహుజన సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర లో భాగంగా బీజేపీ నాయకుడు అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గతంలోనూ అనేక సార్లు రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు బీజేపీ చేసిందన్నారు. రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచిన అమిత్‌షా ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని స్పష్టం చేశారు. వెంటనే మంత్రి పదవి నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ కార్యదర్శి సాయిలు, సహాయ కార్యదర్శి యాదగిరి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సీఐటీయూ నాయకులు శివ, రాజు, నర్సింహులు, రాజేశ్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా విలేజ్ హాట్స్

- రూ. 20 లక్షల వ్యయంతో నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన గదులు
- పట్టించుకోని అధికారులు

కోహీర్, డిసెంబర్ 27 : కోహీర్ ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు తహసీల్ ఎదురుగా నిర్మించిన విలేజ్ హాట్స్ నిరుపయోగంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ గీతారెడ్డి కృషితో అక్కడ మార్కెట్ నిర్వహణకు వాటిని ఏర్పాటు చేయించారు. రూ. 20 లక్షల వ్యయంతో 12 ఏండ్ల కింద నిర్మించారు. కానీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. తద్వారా లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన గదులు, షెడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రజల మేలు కోసం సదుద్దేశంతో నిర్మించిన విలేజ్ హాట్స్ నిరుపయోగంగా తయారైంది. ఆవరణ అంతా ముళ్లపొదలతో నిండిపోయింది. ఇక్కడ ఐకేపీ సిబ్బంది మా త్రం ఎనిమిదేండ్ల కింద రెండు సీజనుల్లో మక్కలను కొనుగోలు చేశారు. ఆరేండ్ల నుంచి అటు వైపునకు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.

కోహీర్ తహసీల్ ఎదురుగా నిర్మించిన విలేజ్ హాట్స్

ప్రతీ గురువారం రోడ్డుపైనే సంత..

కోహీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న రోడ్డుపై ప్రతీ గురువారం సంతను నిర్వహిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు, మిఠాయిలు, బట్టలు, తదితర సామగ్రి విక్రయిస్తుండడంతో ప్రజలతో నిండిపోతున్నది. మరో వైపు వాహనాల రద్దీ. దీంతో కళాశాల, ఉన్నత పాఠశాల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. కొత్తూర్, ఖానాపూర్, బడంపేట ప్రధాన రహదారిపై సంత నిర్వహిస్తుండడంతో పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం వచ్చిందంటే అటు వైపు నుంచి వెళ్లేందుకు వాహనదారులు, ప్రజలు అవస్థలు పడాల్సిందే. తహసీల్ సమీపంలో నిర్మించిన మార్కెట్‌ను వినియోగిస్తే కళాశాల, పాఠశాల విద్యార్థులతో పాటు కొత్తూర్, ఖానాపూర్, బడంపేట, తదితర గ్రామాల ప్రజలకు మేలు కలుగుతుంది.

సంతను ఏర్పాటు చేయాలి

కోహీర్ తహసీల్ ఎదుట ఉన్న స్థలాన్ని దాతలు విరాళమివ్వడంతో విలేజ్ హాట్స్ పేరుతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. రోడ్డు మీద అంగడి పెడుతుండడంతో చాలా మందికి ఇబ్బంది అవుతున్నది. తహసీల్ వద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరికీ మంచిగా ఉంటుంది.

- రాచూరి కనకరత్నం, కోహీర్

రోడ్డు మీద ఇబ్బందులు..

జూనియర్ కాలేజీ ముందు ఉన్న రోడ్డు మీద అంగడి ఉన్న గురువారం రోజు తప్ప నిసరిగా ఇబ్బందులు పడాల్సిందే. ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలంటే కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు మీద చాలా మంది ఉంటారు. పెద్ద సౌండ్ చేస్తూ ఎన్నో బైకులు తిరుగుతుంటాయి. ఎవరూ చేయలేని పరిస్థితి. తహసీల్ కార్యాలయం వద్దకు మారుస్తే అందరూ సంతోషంగా ఉంటారు.

-అనితా సంపత్ కుమార్, కోహీర్

పెన్షన్ దారులకు చేయూత

మున్సిపల్ పాత కార్యాలయ ఆవరణలో కుర్చీలు ఏర్పాటు చేసిన ఆనంద్ కృష్ణారెడ్డి

బొల్లారం డిసెంబర్ 27 : మున్సిపాలిటీ పరిధిలోని పెన్షన్ దారుల కష్టాలను తెలుసుకున్న స్థానిక సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి రూ. 30 వేల సొంత నిధులతో శుక్రవారం వంద కుర్చీలు స్వచ్ఛందంగా అందజేశారు. పాత మున్సిపల్ కార్యాలయానికి ప్రతి నెలా పెన్షన్ కోసం వచ్చే వృద్ధులు దివ్యాంగులు మహిళలు గంటల తరబడి వేచి ఉంటున్నారని తెలుసుకొని ఆపన్న హస్తమందించారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులు కృతజ్ఞతలు తెలిపారు.

హరే కృష్ణ హెరిటేజ్ ఫిస్ట్ ఫైనల్స్‌కు పుట్టగూడ విద్యార్థులు

పౌరాణిక నాటక ప్రదర్శన పోటీల్లో ఫైనల్స్ చేరిన పుట్టగూడ విద్యార్థులు

బొల్లారం, డిసెంబర్ 27 : జిన్నారం మండలం కొడకంచి గ్రామపంచాయతీ పరిధిలోని పుట్టగూడ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నగరంలోని బంజారాహిల్స్‌లో నిర్వహిస్తున్న హరే కృష్ణ హెరిటేజ్ ఫీస్టు పోటీల్లో ఫైనల్‌కు చేరారు. 6 నుంచి 16 ఏండ్లలోపు పాఠశాల విద్యార్థులకు వారి ఆసక్తిని బట్టి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్స్, డ్రామా వంటి మాడ్యూల్స్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వాహకులు పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు సత్తాచాటగా పుట్టగూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు డ్రామాలో ఉత్తమ ప్రదర్శనతో ఫైనల్‌కు చేరారు. విద్యార్థుల వెంట హెచ్ఎం రేణుక దేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

తరంగిణి మేళాను జయప్రదం చేయాలి

జహీరాబాద్, డిసెంబర్ 27 : జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాల ఆవరణలో శనివారం అంగన్‌వాడీ టీచర్ల తరంగిణి మేళాను నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ తెలిపారు. స్థానిక పాఠశాలలో అవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల అనుభావాలు పంచుకుంటూ, నైపుణ్యాలను పెంపొందించేందుకు మేళాను ఏర్పాటు చేశామన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వీధిగా హాజరై జయప్రదం చేయాలని సూచించారు.

30న జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 27 : జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 30న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదాశివపేటలోని సిద్దాపూర్ రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బంగ్లా భారతి తెలిపారు. 10 కంపెనీలు ఉద్యోగమేళాలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు తమ ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 6 సెట్ల రెస్యూమ్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9154084725, 9154938596 నెంబర్లపై సంప్రదించాలన్నారు.

బస్తీలో సీసీ రోడ్డు వేయాలి

బొల్లారం, డిసెంబర్ 27 : కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలను మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీ వాసులు కోరుతున్నారు. శుక్రవారం బస్తీ వాసులతో కలిసి మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ కాలనీలో రోడ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయని, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అందోల్, డిసెంబర్ 27: అన్నాసాగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు జోగిపేటలోని పలు కాలనీలతో పాటు అందోల్ మండలంలోని డాకూక్, అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్, పుల్కల్ మండలం లక్ష్మీసాగర్, చిలిప్‌చెడ్ మండంలోని చిట్కుల్ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. నేడు (శనివారం) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.